హరితహారానికి మొక్కలు సిద్ధం

- వర్షం కోసం ఎదురుచూపు
- పెన్‌పహాడ్ మండలంలోని 29జీపీల్లో 2లక్షల 24వేల మొక్కల పెంపకం

పెన్‌పహాడ్ : గత ప్రభుత్వం తెలంగాణకు హరిత హారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అందులో భాగంగానే ప్రతి గ్రామపంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీని ఏర్పాటు చేసింది. ఆ నర్సరీల్లో ప్రత్యేకంగా వనసంరక్షకులను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచారు. వర్షాలు ప్రారంభమైతే జూన్, జూలై మాసంలో మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది.

నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు..

వర్షాకాలంలో నాటేందుకు ముందస్తుగా అధికారులు మొక్కలను సిద్ధం చేశారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా.. ప్రతి గ్రామపంచాయతీలోని ఒక్కొక్క నర్సరీలో 6వేల నుంచి 10వేల చొప్పున మొత్తం 2లక్షల 24వేల మొక్కలను పెంచారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా బోర్లు, గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని అందించడంతో పాటు ఎండకు ఎండిపోకుండా గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు.



నారాయణగూడెం నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు..

ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సరీల్లో పండ్లు, పూల, అటవీ మొక్కలను పెంచుతున్నారు. అందులో భాగంగానే జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, ఖర్జూర, బాదం వంటి పండ్ల మొక్కలతో పాటు గులాబీ, మల్లె, మందారం పూల మొక్కలను పెంచుతున్నారు. వాటితో పాటు రోడ్లకు ఇరువైపులా నాటేందుకు టేకోమ, పీడ్లో పాం వంటి మొక్కలు అందుబాటులో ఉన్నాయి. గతంతో పోల్చితే ప్రజలు ఇష్టపడే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.

వర్షాలు ప్రారంభం కాగానే నాటుతాం



మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నా యి. అందులో ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచాం. అన్ని నర్సరీల్లో ప్ర స్తుతం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నా యి. వర్షాలు ప్రారంభం కాగానే గ్రామాల పరి ధిలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం.

– రవి, ఏపీఓ

ఆదర్శ పాఠశాలలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులపై కలెక్టర్ బుధవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో చేపడుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధి పనులను ఎస్‌హెచ్‌జీ సంఘాలతోనే చేయించి వారికి వెంటనే బిల్లులు ఇవ్వాలని అన్నారు. పనుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ లాజర్, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంఈఓ శాంతయ్య, ఎంపీఓ మారయ్య, ఏపీఎం సైదయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సంఘబంధాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు వీఓఏలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



నూతనకల్‌లో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సైదులు

నూతనకల్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సైదులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పలు కిరాణ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నామని, ఎవరైనా గుట్కాలు విక్రయించినట్లు పోలీసుల దృష్టికి వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మద్దిరాల : మాదకద్రవ్యాలు, గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మధునాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు కిరాణం దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గుట్కా ప్యాకెట్లను అమ్మితే కేసు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు సీహెచ్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి వీఎల్‌ఎన్ చారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 9సంవత్సరాలుగా పదోన్నతులు, 6సంవత్సరాలుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు తీరని నష్టం జరిగిందని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. వారి వెంట సోమయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి



మల్లయ్య (ఫైల్)

తుంగతుర్తి : ఇటీవల తాటిచెట్టు పైనుంచి జారిపడి తీవ్రగాయాలైన ఓ గీత కార్మికుడు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన బాలగాని మల్లయ్య (45) ఈనెల 25న తాటి చెట్టు ఎక్కి మోకుజారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

అడివెంలలో పశువైద్య శిబిరం



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు ఈ సీజన్‌లో వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి బి.అర్జున్ కోరారు. ఈ సందర్భంగా 100పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్ పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



అంజయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీరవోలు సోమిరెడ్డి

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పేరెల్లి అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మద్ది పద్మ, గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల సైదులు, పేరెల్లి ఉప్పలయ్య, బోయపల్లి సైదులు, రవి, లింగయ్య, ప్రవీణ్, వెంకన్న ఉన్నారు.

భారతమ్మ కుటుంబానికి..



భారతమ్మ కుటుంబ సభ్యులతో నాయకులు

మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన అల్లి భారతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి బియ్యం అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన సూరారపు నరేష్ భార్య మహేశ్వరి ఇటీవల అకాల మరణం చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు గంగదెరి వెంకట్, దాసరి హేమంత్‌కుమార్, భిక్షం, బి. కృష్ణ, ఎస్.రవీందర్, ఆర్.యాదగిరి, కె. ఉప్పలయ్య, జి.శ్రీనివాస్, పి.బాబు, ఎస్.బాబు, జి.యల్లయ్య, ఎస్.ప్రశాంత్, సతీష్, మహేష్, యుగేందర్, వంశీ తదితరులు ఉన్నారు.

వాచ్‌మెన్ ఆకస్మిక మృతి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామానికి చెందిన కొండూరి అనంతమ్మ(59) మంచంలో పడుకొని ఆకస్మికంగా బుధవారం మృతి చెందింది. మృతురాలు మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తుంది. ఆమె మృతి పట్ల ఎంఈఓ నకిరేకంటి రవి, హెచ్‌ఎం శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

నాగారం : ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీపెద్ద మైసమ్మ తల్లి పండుగకు హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. గ్రామాల్లో ఉత్సవాలు జరుపుకోవడంతో ప్రజల్లో ఐక్యమత్యం పెంపొందుతుందన్నారు. గ్రామ దేవతలతో గ్రామంలో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, ఎంపీటీసీ వడ్డే పరుశరాం, యారాల రాంరెడ్డి, ఈదుల కిరణ్‌కుమార్, కూరం వెంకన్న, కన్నెబోయిన మల్లేష్, బండగొర్ల ఎల్లయ్య, ఈదుల అరుణ్, మేడి మల్లేష్, దర్శనం శేఖర్, దర్శనం కొమరయ్య, ఈదుల రమేష్, అంబేద్కర్, గణపురం మహేందర్, సోమనర్సయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

అక్రమంగా పట్టా చేశారని బాధితుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

నూతనకల్ : తమ భూమిని మరొకరికి అక్రమంగా మండల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ పట్టా చేశారని ఆరోపిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం బాధితులు ధర్నా నిర్వహించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాచనపల్లి గ్రామానికి చెందిన మొరిగాల రమేష్‌గౌడ్ 2019లో రేసు రాములు, రాచకొండ అయోధ్య, లింగాల ఏకస్వామితో కలిసి దిర్శనపల్లి గ్రామశివారులో 79 ఆ సర్వే నంబర్‌లో 3ఎకరాల భూమిని కొనుగోళు చేశారు. నలుగురు కలిసి అయోధ్య పేరిట సాదాబైనామాలో పట్టా చేయించామని రమేష్ తెలిపారు. అనంతరం అయోధ్య, రాములు తమతమ వాటాలను విక్రయించగా ఏకస్వామి తాను కొనుగోళు చేమన్నారు. తమకు పట్టా చేయకుండా అయోధ్య ఆ భూమి తనదేనని కోర్టులో వేశారన్నారు. నేను జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు వేయగా తహసీల్దార్ జమీరుదిన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్ తనకు పట్టా చేయకుండా రెండు నెలలు గడిపారన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో తమకు అనుకూలంగా భూమిని పట్టా చేయాలని తీర్పు ఇచ్చినప్పటికీ తెలియకుండా 5కుంటలు కనకటి శ్రావణ్‌కు తహసీల్దార్ పట్టా చేశారన్నారు. అనంతరం డీటీ శ్రీధర్‌నాయక్ సిక్కుల శంకరయ్యకు 30కుంటలు అక్రమంగా పట్టాచేశారన్నారు. జేసీ తీర్పును అమలు చేయకుండా తమ భూమిని మరొకరికి అక్రమంగా పట్టా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన తీర్పు, భూమి కబ్జాలో ఉంటే కోర్టుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించారు.

విత్తనాల కొరతతో రైతుల పాట్లు

- పీఏసీఎస్‌లు, దుకాణాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- జాజిరెడ్డిగూడెం మండలానికి వంద క్వింటాల జీలుగ అవసరం కాగా.. 10క్వింటాలే సరఫరా

అర్వపల్లి : వ్యవసాయ భూముల్లో భూసారం పెంపుదల కోసం రైతులు పచ్చిరొట్టె ఎరువులైన జీలుగ విత్తనాలను తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. అయితే ఈ జీలుగ విత్తనాల కొరత మండలంలో మరింతగా ఉంది. ఈ విత్తనాల కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఈ విత్తనాల అవసరం ఎంతో ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు జీలుగ విత్తనాలు దుక్కిలో వేసి దున్నాక 45 రోజులకు గడ్డి పెరుగుతుందని పూత వచ్చాక కలియదున్నితే పంట దిగుబడి పెరుగుతుందని రైతులు అంటున్నారు. అయితే ఈ విత్తనాల కోసం పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నా దొరికే పరిస్థితి కనిపించడం లేదు.



జీలుగ విత్తనాలు

జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం పీఏసీఎస్‌కు మంగళవారం పది క్వింటాల జీలుగ విత్తనాలు రాగా రైతులు ఒక్కసారిగా ఎగబడి కొనుగోలు చేశారు. చివరికి వచ్చిన వారికి విత్తనాలు దొరకని పరిస్థితి ఏర్పడింది.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

మండలంలో ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 21వేల ఎకరాల్లో వరిపంట సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే మండలానికి సుమారు వంద క్వింటాల జీలుగ విత్తనాలు అవసరం కానున్నాయి. అయితే మండలానికి ఇప్పటి వరకు కేవలం పది క్వింటాల విత్తనాలు మాత్రమే వచ్చాయి. తిమ్మాపురంలోని పీఏసీఎస్‌కు ఈ విత్తనాలు రాగా మంగళవారం గంట వ్యవధిలోనే రైతులు కొనుగోలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు అక్కడికి వెళ్లే సరికి అప్పటికే ఉన్న విత్తనాలు స్థానిక రైతులు కొనుగోలు చేశారు. దీంతో ఇతర గ్రామాల నుంచి వెళ్లిన రైతులు వెనుదిరిగి రావాల్సి వచ్చింది. 30కిలోల జీలుగ విత్తనాల బస్తా సబ్సిడీ పోను ధర రూ.1,116 చొప్పున విక్రయిస్తున్నారు. మండలానికి సుమారు మరో 90క్వింటాల జీలుగ విత్తనాలు అవసరముంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం మండలానికి 30క్వింటాల విత్తనాలను కేటాయించింది. అందులో పది క్వింటాలు రాగా మరో 20క్వింటాలు రావాల్సి ఉంది. వెంటనే ఈ విత్తనాల కొరతను తీర్చాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీలుగతో భూసారం పెరుగుతుంది



భూమిలో సారం పెరగాలంటే జీలుగ విత్తనాలను పెంచడం తప్పనిసరి. ప్రతి సీజన్‌లో జీలుగ విత్తనాలు వేసి దుక్కి దున్ని 45రోజులకు గడ్డి పెరిగాక కలియదున్ని వరిసాగు చేస్తాను. అలా చేయడం వల్ల భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు పంట దిగుబడి పెరుగుతుంది. నాకు ఆరు బస్తాల వరకు జీలుగ విత్తనాలు అవసరముండగా కేవలం రెండు బస్తాలు మాత్రమే దొరికాయి.

– మీలా కిష్టయ్య, రైతు, తిమ్మాపురం

రెండు, మూడు రోజుల్లో విత్తనాలు వస్తాయి



మండలానికి తాత్కాలికంగా 30క్వింటాల జీలుగ విత్తనాలను కేటాయించారు. ప్రస్తుతం పది క్వింటాలు మాత్రమే రావడంతో వెంటనే పంపిణీ చేశాం. మరో 20క్వింటాల విత్తనాలు రావాల్సి ఉంది. ఈ సీజన్‌లో మండలానికి సుమారు 100క్వింటాల జీలుగ అవసరమని అంచనా వేస్తున్నాం.

– ఆర్. శిధర్‌రెడ్డి, ఏఓ, జాజిరెడ్డిగూడెం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలోని విశ్వభారతి ఉన్నత పాఠశాలలో 1994–95లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు బుధవారం స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, సుభాషిని, వెంకటేశ్వర్లు, రామ్మోహనాచారి, రాజేష్‌ఖన్నా, లక్ష్మణశర్మ, రాంప్రసాద్, కరీమ్, నర్సింహారెడ్డి, విద్యార్థులు నాగరాజు, శ్రీనివాసాచారి, ఉష, శ్రీలత, ప్రభావతి, ఉపేందర్‌రెడ్డి, వీరప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చివరిదశలో ఆలయ పునర్నిర్మాణ పనులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న నిధులతో పనులు చేపడుతున్నారు. గతంలో ఆలయం పూర్తిగా శిథిలమై వర్షాలకు కురుస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అయితే దేవాలయ పునర్నిర్మాణంతో పాటు దాతల సహకారంతో మండపం చుట్టూ స్టీల్ గ్రిల్స్ పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో ఇంకా కొన్ని పనులు చేపట్టాల్సి ఉంది. ఆలయ అభివృద్ధి కోసం మంజూరైన నిధులతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. కాగా గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5కోట్లతో కూడా చేపట్టే పనులను వెంటనే ప్రారంభించాల్సి ఉంది.



నిర్మాణం పూర్తయిన దేవాలయం

క్షుద్రపూజల కలకలం

అనంతగిరి : మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో మంగళవారం రాత్రి క్షుద్రపూజలు కలకలం రేపాయి. దీంతో గ్రామస్తులు తీతీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అమీనాబాద్ గ్రామానికి చెందిన బియ్యాల పద్మతో పాటు మరో ఐదుగురు వ్యక్తులతో కలిసి తన ఇంటి పక్కనే ఉన్న పడావు ఇంట్లో క్షుద్రపూజలు చేసేందుకు రంగురంగుల ముగ్గు, నిమ్మకాయలు, హోమం చేసేందుకు అగ్నిగుండం, ఇతర సామగ్రిని సిద్ధం చేశారు. సంఘటనాస్థలంలో సుమారు ఆరు అడుగుల గుంత తవ్వి పూడ్చినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. క్షుద్రపూజలు జరుగుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు, గ్రామపెద్దలకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సారావుపేట, గుంటూరు, జగ్గయ్యపేటకు చెందిన వారు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిందితులపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు చేస్తున్న భక్తులు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి అభిషేకం, గణపతిపూజ, ధ్వజారోహణం, దేవత మండపాదనలు, గణపతి హోమం, రుద్రహోమం, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మేడోజు పోతులూర చారి, మేడోజు రామబ్రహ్మచారి, బొల్లు వీరయ్యనాయుడు, మేడోజు ఆంజనేయులుచారి, ఆకుల వెంకటయ్యగౌడ్, పోతులూరి చారి, ఆకుల శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ యాదమ్మ పరిశీలించారు. వంద రోజుల పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కూలీల హాజరు నమోదు శాతం తెలుసుకొని వారితో మాట్లాడారు. రోజుకు రూ.300వేతనం వచ్చేలా పనులు చేసుకోవాలని సూచించారు. ఉపాధిహామీలో భాగంగా ఎస్సారెస్పీ కాల్వలు శుభ్రం చేసే పనులు గ్రామంలో ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బి.లింగయ్య, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న టీఏ యాదమ్మ

అరగంటలో ముగిసిన సర్వసభ్య సమావేశం

శాలిగౌరారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. 11.25 గంటలకు ప్రారంభమైన సమావేశం 11.55 గంటలకు ముగిసింది. సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోగా కనీసం ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను కూడా సమావేశానికి అందించకపోవడం గమనార్హం. కిందిస్థాయి సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. జెడ్పీటీసీతోపాటూ 13 మంది ఎంపీటీసీలు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉండగా ఎంపీపీతోసహా ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. మండలంలో మిషన్ భగీరథ పథకం ద్వారా సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి నిర్వహణకు సంబంధించి ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగం, పనుల నిర్వాహణపై స్థానిక ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండా నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఏఈని నిలదీశారు. ఈ విషయంపై సమాధానం ఇచ్చేందుకు మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ రాంబాబు ప్రయత్నించగా సభ్యులు అడ్డుకున్నారు. ఎంపీపీ గంట లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, డీటీ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

శిథిలావస్థలో నీటి పారుదల కార్యాలయం

నడిగూడెం : మండల కేంద్రంలోని నీటి పారుదల శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. 60 ఏళ్ల కిందట నాగార్జునసాగర్ కాల్వ నిర్మాణ సమయంలో నీటి పారుదల శాఖ అధికారుల కోసం విశ్రాంత భవనంగా నిర్మించారు. కానీ గత 20 సంవత్సరాలుగా ఈ భవనాన్ని నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే ఓ వైపు కూలింది. మరో వైపు కూలే ప్రమాదం ఉన్నది. ఈ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, డీఈ, ముగ్గురు జేఈలు విధులు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన కార్యాలయ భవనం నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.

ఎన్నికల్లో రాకేష్‌రెడ్డి గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న సీతయ్య

తుంగతుర్తి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మెజార్టీ పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు బీఆర్‌ఎస్ అభ్యర్థికి వేసినట్లు పోలింగ్ సరళి తెలియజేస్తుందన్నారు. రాకేష్‌రెడ్డి గెలుపు బీఆర్‌ఎస్ పార్టీకి బూస్టింగ్‌లా ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్లిందన్నారు. రాకేష్‌రెడ్డికి గెలుపు కోసం కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీశ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు గోపగాని శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడవాసికి నందమూరి స్వర్ణ నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న మూసా అలీఖాన్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన నటుడు, నిర్మాత, మూసాఅలీఖాన్‌కు నందమూరి స్వర్ణనంది అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ రుద్రరాజు పద్మారాజు, జహిరాబాద్ మాతాజీ చేతుల మీదుగా మూసాఅలీఖాన్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మూసా అలీఖాన్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు స్వర్ణనంది అవార్డును అందుకోవడం చాల ఆనందంగా ఉందన్నారు.